# హత్యలే హత్యలు!

నాగ్గుబులుగా ఉంది.

"భద్రం!" పిలిచాను.

భద్రం పత్రిక అదే పనిగా చదువుతున్నాడు. చదవటం కష్టం. నాకు తెలీదా? ఎందుకు వాడు అదే పనిగా చదవటం? పోనీ డిటెక్టివు సాయిత్యం ఉంటుందాంటే అదీ లేదాయే. డిటెక్టివులంతా తుపాకేసినట్టు మాయమయారెంచేతా?

"ఏంటి, గురో?" అన్నాడు భద్రం. పత్రికలోనించి నింపాదిగా జవాబిస్తూ.

"డిటెక్టివ్‌లంతా తుపాకేసినట్టు మాయమయారెంచేత భద్రం?" అడిగాను.

"ఇప్పుడాళ్లకి గిరాకీ లేదు గురో. అనువెంపలాయమెంటొచ్చేసిందాళ్లకి."

ఆలోచించాను.

"అనువెంపలంటే ఏమిటి. భద్రం?"

"నిరుద్యోగవన్నమాట. పన్లేదు. ఆళ్లుమటుకేం జేస్తారు. చానామంది సినిమాల్లో ఆటిల్లో జేరిపోయినారు."

"నేన్నమ్మను భద్రం. నీ సినిమా పిచ్చికొద్దీ హాట్లా మాట్లాడుతున్నావు."

"అదేంటి గురో? గుండెలో బల్లెం ఏంటి? దరిబీసు నంబరువన్ ఏంటి? కత్తిమీద పిస్తోలేంటి? అన్ని డిటెక్టివ్ ఫిలిములేగా?"

ఆలోచిస్తున్నాను.

"చూడు, భద్రం! డిటెక్టివులు సినిమాల కెక్కారంటే అది పెద్ద హుత్పాతనే. కారణం ఏంటయుంటుందంటావ్? అంతుకులు లేకనా? మరింకెందువల్ల?" అడిగాను.

"పత్తిరిక చదవండి, గురో. మీకే తెలుస్తది. అంతకులు లేకపోవటమేంటి? హత్యలు కోట్లు, లచ్చలు, వేలకువేలు! కాని బయిరంగంగా బట్టబయలుగా, పట్టపగలే జరిగిపోతున్నాయి. ఇంత డిటెక్టివుగాడు చేసేదేంటి?"

నాకు ఉత్సాహవొచ్చింది.

"నిజంగానా, భద్రం. అయితే మనం కులూలు పట్టుకుని ఈ అత్యాచారాల డిటెక్టివు చేసిపారేగూడదూ?"

"ఏంటి మనం చేసేది? అందరూ చూస్తుండగా జరిగే హత్యలకి కులూలేంటి, గురో. ఒక పోరసెసను తీస్తివి. పోలీసులు తుపాకులేసి కాల్చి ముప్పయ్యిద్దరిని చంపేసిరి. ఇంక నువు చేసేదేంటి? రైలుకు రైలు ఢామ్మిన గుద్దుకొనె. నూట పన్నెండు మంది చచ్చిరి. మిగిలిన వెయ్యిన్నూట పదహారు మందీ గాయపడ్డి. ఇంక నువు చేసేదేంటి? తొంబయ్యారు మందెక్కెల్లే యిమానం నడాకాశంలో ఠాప్పిన పేలె. అందరూ పైసలా – ఎయిరోస్టెసుతో సహా."

"అబ్బా! ఇంత హాశ్చర్యకరంగా అత్యాచారాలు జరుగుతుంటే అంతకులే దొరకటం లేదన్నమాట!"

"మెతికి చచ్చినాడెవడని? హత్యలింతేనా? యుద్ధం! దీపావళి అనుకో, గురో! బాంబర్ల మీద పోనూ, నేపాళం బాంబులెయ్యనూ! ఊళ్లకూళ్ల మతాబాలల్లె యెలుగుతున్న యనుకోల్సిందే."

"అదెక్కడ, భద్రం."

"వీత్నాం అనే దేశంలో."

"అంతకులు దొరకరా?"

"పట్టుబడితే దొరుకుతారు. కాని పట్టుకునేదెట్టా? ఆళ్లు యిమానాల్లో రంయోమని పారిపోతారు. ఒక నేపాళం బాంబెయ్యి, పారిపో. అదీ వరస."

"ఎవరాళ్లు!"

"అమెరికాయిలు."

"గొప్ప అంతకులన్నమాట. విమానంతో పారిపోయే అంతకుణ్ని పట్టుకోటం తేలిక్కాదు, భద్రం! చాలా కష్టం. కులూలన్నీ గాల్లో కొట్టుకుపోతై."

"కొందరు అమెరికాయి అంతకులు చిక్కారు గురో. కాని ఆళ్లని ఏవీ అనటానికి లేదు. మా యిమానికుల్నేవన్నా చేశారో నేపాళం బాంబు వేసి మీరగతం చూస్తానని అమెరికాయి పెరిసిడెంటు వీత్నాం వాళ్లని బెదరగొట్టాడు. అంతతో వీత్నాం వాళ్లు కాస్త తగ్గారన్నమాట."

నాకు నిస్పృహ కలిగింది. వీతనాం పోయి అంతకులను పట్టీ ప్రయోజనం ఉండదు. లంచాలు మెక్కిన మంత్రిని పట్టుకున్నట్టే.

"ఏం, భద్రం? మనం వీత్నాం పోయి అంతకులను డిటెక్టివు చేసి కూడా ఏం లాభం? లంచాలు మెక్కిన మంత్రిని పట్టుకున్నట్టే!" అన్నాను.

"అవును, గురో. యిశారణ చేసేది లేదు పొమ్మంటారు! ఎందుకొచ్చిన అయిరాన!... కాని డిటెక్టివులకి అమెరికాయి దేశం సొరగం, గురో."

"ఎంచేత, భద్రం?"

"ఎంచేతనా?" భద్రం పత్రికను తీసి, పటక్కున విప్పి, పెళుక్కున విరిచి, ఎగాదిగా చూసి, "ఆమెరికాయిలో రెండు నిమిషాలకో అత్య; అరనిమిషానికో మానభంగం. స్తిరీలు ఒంటరిగా యీదులంట తిరగటం అపాయం. అట్టా అని అమెరికాయి పోలీసులే యెచ్చరిస్తున్నారు. సావిరంగా, అక్కడ డిటెక్టివులకి చేతినిండా ఊపిరి సలపనంత పని!"

నాకు హుత్సాహవొచ్చింది.

"మనం అమెరికాయికి పోదావా, భద్రం?"

"అదీ అంత తేలిక్కాదు, గురో. పెళ్లీపిచ్చీ అని సావిచ్చెబుతారు చూడు. అదేమోస్తరు. అమెరికాయిలో కోట్లూ, లచ్చలూ డాలర్లు. కాని డాలర్లుంటేగాని అక్కడికి పోలేం. అదే చిక్కు."

ఆలోచించాను.

"డాలర్లంటే ఏమిటి, భద్రం."

"మనకు రూపాయిల్లేవూ? అట్టాగే ఆళ్లకిడాలర్లు. ఓ కట్ట బీడీలు కావాలనుకో ఓ డాలరిచ్చి చిల్లర తీసుకుంటాం. ఓ సోడా తాగినా అంతే. అది వాళ్ల డబ్బు. కాని డాలరంటే మోత. మన రూపాయికీ, ఇంగిలీసోడి సవరుకూ, మరి ఇంకే డబ్బుకి అంత గనత లేదనాల్సిందే. డాలరు! డాలర్లున్నాడు సిటారు కొమ్మెక్కి కూర్చున్నాడన్నమాటే!"

ఆలోచిస్తున్నాను.

"మాటొరసకి నాకు డాలర్లు కావాలంటే ఏం చెయ్యాలి?"

"ముందు అమెరికాయికి పోవాలి. కుదిరి సావదు గురో. ఈ ఆలోశన నాకు శాన్నాళ్లయి కలిగిందనుకో. ఏం దేశం! సొరగం! ప్రతిబుల్లాడికీ ఓ బుల్లికారు, ఓ బుల్లి పిస్తోలు. ఓ బుల్లి రేడియో – టాన్సిటారు రేడియో. ఎంత బుల్లిదంటె, చేతి గడియారవం తుంటుంది. దాని మోతా, చెవులు గడెలు పడాల్సిందే. అక్కడంతా రూల్సు. మన నల్లోళ్లు తెల్లాళ్లతో కలవరాదు. నల్లాళ్లకు యేరే రైలుపెట్టెలు. యేరేటీ అంగళ్లు. యేరే పాకీదొడ్లు, యేరే యిళ్లు. తెల్లమ్మాయి కేసి నల్లోడు చూశాడా, సఫా! అయినా అక్కడ సొరగం! ఇంత తెల్లాళ్లకెంత సొరగం గుండాలి? ఏం, గురో?"

"మనం మాటొరసకి డాలర్లు కొంటే అక్కడికి పోలేం?"

"ఎందుకు పోలేం, గురో? మన చుప్పన్న బావమరిది అమెరికా యెళ్లొచ్చాడు. ఆయనగారే నాకిదంతా చెప్పింది. పాసుపోరటేశాడంట. ఇంజెక్సన్లు పుచ్చుకున్నాడంట. యిమానం యెక్కేశాడు."

"రూపాయికెన్ని డాలర్లు భద్రం?" అన్నాను.

భద్రం ఒక వెధవ నవ్వు నవ్వి, "అట్నుంచిటు, గురో. డాలరుకెన్ని రూపాయల నడగాలి, గురో. యెనక డాలరుకు నాలుగైదు రూపాయలుండేవి. ఇప్పుడు గనంగా పెంచి తొమ్మిది, పది చేశారు" అన్నాడు.

"అబ్బా, మన రూపాయికి అమెరికాయిలో గిరాకీ పెరిగిందన్నమాట!"

***ముద్రణ : యువ, అక్టోబర్ 1966***